


హైదరాబాద్ వార్త

# ఎక్సైజ్ శాఖకు డబ్బుల వర్షం !

◆ న్యూఇయర్ వేడుకులకు సిద్ధమైన నగరం ◆ ఈ పబ్బుల్లో న్యూ ఇయర్ వేడుకలకు నో పర్మిషన్

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త**

గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోవాలనుకునే యువతను ఆకట్టుకునే పబ్బుల్లో కొన్నింటికీ న్యూ ఇయర్ వేడుకలకు నో పర్మిషన్ అంటున్నారు పోలీసులు. గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోవాలనుకునే యువతను ఆకట్టుకునే పబ్‌లు, ఈవెంట్ ఆర్గనైజర్లు.. వివిధ ఆఫర్లతో రడీ అవుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు పలు ఆంక్షలు విధించారు. రాత్రి ఒంటి గంటవరకు వేడుకలు ముగించుకోవాలని ఆదేశాలు జారీచేశారు. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లోని 34 పబ్బుల్లో నాలుగు పబ్బులకు అనుమతి నిరాకరించారు. హాట్‌కప్, అమినేషియా, బ్రాండ్‌వే, బేబీ లాండ్ పబ్బుల్లో నూతన సంవత్సర వేడుకలకు పర్మిషన్ రద్దుచేశారు.



**అర్ధరాత్రి ఒంటి గంట వరకు అనుమతి...**

ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీన అర్ధరాత్రి ఒంటి గంట వరకు బార్లు తెరిచి ఉంచనున్నారు. దీంతో తాగినోళ్లకు తాగినంత మందును విక్రయించే ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆయా క్లబ్‌లు, పబ్‌లకు భారీగా మద్యాన్ని తరలించారు. రాత్రి ఒంటి గంట వరకు ఈవెంట్ల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో మద్యం అమ్మకాలు భారీగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. నిరుడు డిసెంబర్‌లోనే అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఆ నెల చివరి వారంలో మద్యాన్ని ఏరులుగా పారించింది. కేవలం ఆరు రోజుల్లోనే రూ.1000 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. గత ఏడాది చివరి మూడు దినాల్లో.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19 మద్యం డిపోల నుంచి 6.51 లక్షల బీర్ కేసులు, 4.80 లక్షల లిక్కర్ కేసులు అమ్ముడయ్యాయి. 2021 డిసెంబర్‌లో చివరి నాలుగు రోజుల్లో రూ.600 కోట్ల మద్యం అమ్ముడుపోగా.. 2022లో అది రూ.775 కోట్లకు చేరింది. 2023 లో కేవలం చివరి మూడురోజుల్లో రూ.750 కోట్లకుపైగా మద్యం అమ్ముడైంది.

**ఎక్సైజ్ శాఖకు డబ్బుల వర్షం...**

ఆబ్కారీ శాఖకు డబ్బుల వర్షం కురిపించే పండుగలు. ఈ సారి డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల్లో మద్యం అమ్మకాల ద్వారా సుమారు 1,000 కోట్లు సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు నిబంధనల్లో సడలింపు ఇవ్వనున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇందుకోసం ప్రతిజిల్లా, ప్రతి డివిజన్‌కు ప్రత్యేక టార్గెట్‌లు ఫిక్స్ చేసినట్టు సమాచారం. ఈ మేరకు కింది స్థాయి సిబ్బందికి ఎక్సైజ్ ఉన్నతాధికారులు మౌఖిక అదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. లక్ష్యం వెయ్యి కోట్లు కాగా కనీసం రూ.800 కోట్లు రావచ్చని అంచనా వేస్తున్నారు. దసరాకూ ఇదేతరహా ప్రణాళికలు అమలు చేయడంతో కేవలం 11 రోజుల్లోనే రూ.1300 కోట్లు వచ్చాయి. నాడు అనుకున్న లక్ష్యం నెరవేరకపోవడంతో.. ఈసారి పకడ్బందీగా టార్గెట్ ఫిక్స్ చేసినట్టు తెలిసింది. శనివారం నుంచి బుధవారంలోగా ఐదు రోజుల్లో రూ.1500 కోట్లకు తగ్గకుండా తాగించాలని, ఆ స్థాయిలో ఇప్పటికే అన్ని దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నట్టు సమాచారం.

# 'లైట్' తీస్కోవద్దు..!



✱ లైట్ ఆర్పితే ప్రమాదమే ✱ మంచుతో రహదారి భద్రతకు ముప్పు
✱ కొద్ది రోజులుగా దట్టంగా కమ్ముకుంటున్న పొగమంచు

**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త**

కొద్ది రోజులుగా రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట రహదారులు రక్తమోడుతున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో, ప్రత్యేకంగా హైవేలపై ఇటీవల జరిగిన ప్రమాదాల్లో పలువురు వాహనదారులు మృత్యువాత పడగా మరికొందరు గాయపడ్డారు. మంచుకురిసే వేళలో సరైన జాగ్రత్తలు పాటించకుండా వాహనాలు నడపడం వల్ల తెల్లవారు జామున ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు రహదారి భద్రతా నిపుణులు చెబుతున్నారు. కొద్దిరోజులుగా నగర శివారు ప్రాంతాల్లో ఒక కారు ఆగి ఉన్న లారీని ఢీకొడంతో కార్లో ప్రయాణిస్తున్న వాళ్లు కొందరు చనిపోయారు. పొగమంచు దట్టంగా అలుముకొని ఉండడంతో డ్రైవర్ ఆగి ఉన్న లారీని గుర్తించలేక పోయినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. ఇటీవల కొందరు స్నేహితులు కారులో ప్రయాణం చేస్తూ దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో రహదారి కనిపించక చెరువులోకి దూసుకెళ్లి ఒకరు మినహా అందరూ మృతిచెందిన విషయం తెలిసిందే. కొద్దిరోజులుగా ఉదయం వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. చలితోపాటు మంచు కురుస్తుండడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. ఈ క్రమంలో హైవేలపై వాహనాలను నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

**'లైట్' వెలగాల్సిందే...**

– దట్టమైన పొగమంచు కమ్ముకొని ఉన్న సమయంలో వాహనాలను నడిపేటప్పుడు కచ్చితంగా ఫాగ్ లైట్లు వెలుగుతూనే ఉండాలి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొనే ప్రమాదం ఉంది.

– రాత్రి వేళల్లో హైబీమ్ లైట్లకు బదులు లోబీమ్ లైట్లను వినియోగించాలి.

– ప్రధాన రహదారుల మధ్యలో ఉండే డివైడర్లను గమనించకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు పొంచి ఉన్నట్లే. ఇలాంటి రహదారులపైన ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొనే ఆవకాశం తక్కువగానే ఉండొచ్చు. కానీ సరైన వెలుతురు లేకపోవడం వల్ల డివైడర్లే మృత్యు ఘంటికలు మోగించే ప్రమాదం ఉంది. పొగమంచు కమ్ముకొని ఉన్నప్పుడు లైట్లు ఆర్పినా, కాంతి తక్కువగా ఉన్నా డివైడర్లను గుర్తించడం కష్టం.

– సాధారణంగా హైవేలపైన కార్లు, ఇతర అన్ని రకాల వాహనాలు గంటకు 80–90 కిలోమీటర్ల వేగంతో వెళ్లేందుకు అనుమతి ఉంటుంది. కానీ తెల్లవారు జామున 4 గంటల నుంచి ఉదయం 9 గంటలవరకు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల కంటే వేగం దాటకుండా వాహనాలను నడపాలని ఆర్టీఏ అధికారులు సూచిస్తున్నారు.

**వెనుక లైట్లు వెలగాలి...**

–రోడ్డు పక్కన బండి నిలిపి ఉంచినప్పుడు హెడ్ లైట్‌తో పాటు, వెనుక లైట్లు వెలుగుతూ ఉండాలి. దీనివల్ల ఇతర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. నిలిపి ఉంచిన వాహనం ఉనికిని ఈజీగా గుర్తించేందుకు అవకాశం లభిస్తుంది.

– అలాగే వాహనం చుట్టూ రేడియం టేప్ తప్పనిసరి. దీనివల్ల మంచు కురిసే సమయంలోనూ వాహనం ఉనికి తెలుస్తుంది. చాలావరకు వాహనదారులు ఈ చిన్న నిబంధనను పాటించకపోవడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని రవాణా శాఖ అధికారులు పేర్కొంటున్నారు. తెల్లవారుజామున జరిగే ప్రమాదాల్లో డ్రైవర్లు నిద్రమత్తులో ఉండడం మరో కారణం. సాధ్యమైంత వరకు ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు వాహనాలను నడపకపోవడమే మంచిది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి...**

– పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఆ సమయంలో రోడ్డు మధ్యలో వాహనం నడపడం కంటే ఎడమవైపు నెమ్మదిగా వెళ్లడం మంచిది. వేగాన్ని కూడా 60 కిలోమీటర్ల నుంచి ఇంకా తగ్గించి నడపాలి.

– సాధారణంగా ఉదయంపూట ప్రయాణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఆ సమయంలో ఏదో ఒక సంగీతం వింటూ బండి నడుపుతారు. ఈ ధోరణి ప్రమాదకరమని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# రెడ్డిహాస్టల్‌ను మరింత అభివృద్ధి చేస్తా

రోడ్డు భవనాలు, సినీమా ఫొటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**గన్‌ఫౌండ్రి, డిసెంబరు 29 ప్రభాతవార్త:**

అన్నివర్గాల ప్రజలకు విద్యను అందుబాటులో ఉండాలని ఆనాడే రాజ బహుదూర్ వెంకటరామ రెడ్డి రెడ్డి హాస్టల్స్‌ను స్థాపించినట్లు రాష్ట్ర రోడ్డు భవనాలు, సినీమాఫొటోగ్రఫీ శాఖమంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. రెడ్డి హాస్టల్ మొదటి అల్యూమ్ని సమావేశంలో అల్యూమ్ని ఛైర్మన్‌గా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని రెడ్డి హాస్టల్ అల్యూమ్ని ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామీద పెట్టిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఆ భాద్యతలను నిర్వర్తిస్తానన్నారు. మంత్రిగా ఎంతో బిజీగా ఉన్నప్పటికి హాస్టల్ అవసరాలను ఎప్పటికప్పుడు తీరుస్తానని, హాస్టల్ కోసం ఏకరం భూమి కావాల్సి ఉందని, రెడ్డి హాస్టల్ భవన నిర్మాణానికి ప్రభుత్వంలో చర్చించి బడ్జెట్ మంజూరీ చేస్తానన్నారు. ఎంతో మంచి విద్య భోదన ఉన్న రెడ్డిహాస్టల్‌కు ఛైర్మన్‌గా ఎన్నుకోవడం సంతోషదాయకమన్నారు. కాగా ఓఆర్‌ఆర్ అమ్ముకున్నవాళ్లపై విచారణకు ఆదేశించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ముందు గత ప్రభుత్వం 7,300కోట్లకు ఓఆర్‌ఆర్‌ను అమ్ముకున్నట్లు చెప్పారు. హారీష్‌రావుకు మామమీదనో, బామ్మర్దిపైన కోపం ఉందని అందుకే అసెంబ్లీలో విచారణకు డిమాండ్ చేసినట్లు చెప్పారు. ఈ ఫార్ములా రేసులో ఒకరో ఇద్దరో జైలుకు పోతారన్నారు. 50శాతం తెలంగాణను నగరీకరణ చేసేందుకు ఉపయోగపడే అధ్భుతమైన ప్రాజెక్టు రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) 2017లో ఇన్ ప్రిన్సిపల్‌గా మంజూరీ అయినప్పటికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం మొద్దు, నిద్రపోవడం వల్ల ఈ ప్రాజెక్టు పట్టాలెక్కడానికి 6 సంవత్సరాలు ఆలస్యమైందన్నారు. తాను మంత్రి పదవి చేపట్టిన రెండవరోజు డిసెంబర్ 9వ తేదీన కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసి ఆర్‌ఆర్‌ఆర్ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి విన్నవించినట్లు చెప్పారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి జైకా సంస్థ ద్వారా 6500 కోట్ల రూపాయల రుణం తెచ్చి మూడేండ్లలో ఓఆర్‌ఆర్‌ను నిర్మించినట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఏడాది కాలంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు చెప్పారు.



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

## డబ్ల్యూడిసిడబ్ల్యూ జిఓ సంఘానికి ఎన్నిక

కొత్త అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అక్కేశ్వరావు, హుస్సేన్

**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త**

తెలంగాణ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ (డబ్ల్యూడిసిడబ్ల్యూ) రాష్ట్ర గెజిట్స్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఈ అక్కేశ్వరావు, షాబాన్ హుస్సేనులు ఎన్నికయ్యారు. ఈ మేరకు దీనికి సంబంధించి హైదరాబాద్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కొత్త కమిటీ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి దీపా రెడ్డి ప్రకటించారు. అనంతరం వారికి నియామక పత్రాలను ఈ సందర్భంగా అందచేశారు. రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షునిగా ఈ అక్కేశ్వరావు. అసోసియేట్ అధ్యక్షునిగా ఎన్ మోతి, ఉపాధ్యక్షులుగా కె సబిత, బి నాగమణి, ఎన్ కనకదుర్గ, ప్రధాన కార్యదర్శిగా షాబాన్ హుస్సేన్, జాయింట్ సెక్రటరీలుగా ఎన్ స్వరూపారాథోడ్, సిహెచ్ అనంత లక్ష్మి, జికె సంతోష్, ట్రెజరర్‌గా జె స్వప్న, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి జ్యోత్స్న, పబ్లిసిటీ సెక్రటరీగా సైతా రుక్సానా, కార్యాలయ సెక్రటరీగా ఐ నీలిమ, కల్చరల్ సెక్రటరీగా వంగల హేమ భార్గవి, స్పోర్ట్, గేమ్స్ సెక్రటరీగా ఎం కవితతో పాటు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎల్ శాంతిరేఖ, ఆర్ మమత, ఇ రోజా, సిహెచ్ శ్రీమతి ఎన్నికయ్యారు.

## ముగిసిన రాష్ట్ర సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు

తునుజా కామేశ్వర్‌కు హ్యాట్రిక్ స్వర్ణాలు

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్ చాంపియన్‌షిప్ ఘనంగా ముగిసింది. హుస్సేన్ సాగర్‌లో నాలుగు రోజుల పాటు అలరించిన పోటీల్లో హైదరాబాద్ ఉద్భవ్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు అమ్మాయిలు తనుజా కామేశ్వర్, దీక్షిత కొమరవెల్లి పతకాల మోత మోగించారు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో తనుజ మూడు స్వర్ణాలతో హ్యాట్రిక్ సాధించింది. దీక్షిత కొమరవెల్లి ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఒక కాంస్యంతో అత్యధికంగా నాలుగు పతకాలు కైవసం చేసుకుంది. పోటీల మూడో రోజే విజేతలు తేలిపోవడంతో ఆఖరి రోజు ఆయా స్థానాల్లో ఎలాంటి మార్పు లేకుండా టోర్నీ పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు, చిన్నారుల్లో స్ఫూర్తినింపే ప్రసంగం చేశారు.

## నేషనల్ రెజ్లింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించిన సంకీర్తన్ యాదవ్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** సీనియర్ సౌత్ ఇండియన్ నేషనల్ రెజ్లింగ్ చాంపియన్సిప్‌లో తోట సంకీర్తన్‌యాదవ్ సిల్వర్ మోడల్ సాధించాడు. జైభవాని వ్యాయామశాల గొల్లకిడికి అర్జున్ ఫైల్వాన్ ఉస్తాద్ నుండి చైతన్యపురి డివిజన్‌కి చెందిన తోట సంకీర్తన్‌యాదవ్ గతంలో తెలంగాణలో జరిగిన పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. తెలంగాణ నుండి సీనియర్ సౌత్ ఇండియన్ నేషనల్ రెజ్లింగ్ చాంపియన్సిప్‌కు ఎంపికై అందులో 67 కేజీల గ్రీస్ రోమన్ విభాగంలో పోటాపోటీగా జరిగిన పోరులో సంకీర్తన్ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. తోట సంకీర్తన్‌యాదవ్ అనేక పోటీలలో విజయ పరంపర కొనసాగిస్తున్నాడు. మరిన్ని పోటీల్లో విజేతగా నిలుస్తూ భవిష్యత్తులో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సంకీర్తన్ విజయం పట్ల అతని తండ్రి చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట మహేష్‌యాదవ్ అభినందనలు తెలియజేశారు.

# బిసిల చైతన్యంతోనే రాజ్యాధికారం

శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి



**హైదరాబాద్, డిసెంబరు 29,ప్రభాతవార్త:**

బీసీలందరూ గ్రామీణ స్థాయిలో చైతన్యవంతంగా ఉన్నప్పుడే బీసీల రాజ్యాధికారం సిద్ధిస్తుందని, ప్రశ్నించి నిలదీసి ఎదిరించినప్పుడే అది సాధ్యమని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఈమేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సమాజ్, బీసీ టైమ్స్ ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం జరిగే బీసికుల బంధువుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈసందర్భంగా మధుసూధనాచారి మాట్లాడుతూ ఎంబీసీ, బీసీ కులాలను కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం రాజ్యాధికారం డబ్బు అనేభయంకరమైన వ్యవస్థలో ఉందన్నారు. చట్టసభల్లో ఇప్పటికి చాలా బీసీ కులాలకు ప్రాతినిధ్యం లేదని, ఉన్న కొన్ని కులాలకు జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమన్నారు. పక్కనున్న తమిళనాడు రాష్ట్రంలో సీట్లు అడిగే స్థాయి నుంచి సీట్లు ఇచ్చేస్థాయికి బీసీ నాయకత్వం ఎదగడం సంతోషకరమన్నారు. తాను స్పీకర్‌గా ఉన్నప్పుడు కనీసం జిల్లా సరిహద్దులు దాటని కులాలను హైదరాబాద్ తీసుకొచ్చి అసెంబ్లీ తదితర ప్రాంతాలను చూపించి తనకున్న అభిమానాన్ని చాటుకున్నానన్నారు.. ఒక లక్ష్యం పెట్టుకుని ఆ లక్ష్యం నెరవేరేవరకు టీం వర్క్ చేసి బీసీలు శక్తిగా తయారు కావాల న్నారు. తాను అందరికి అందుబాటులో ఉంటా నని ఎప్పుడు వచ్చినా కలిసి, బీసీ బావజాల వ్యాప్తికి తనవంతు సహకారం అందిస్తానన్నారు.

సభాధ్యక్షులు, బుడబుక్కల సంఘం ప్రెసిడెంట్ విఠల్ మాట్లాడుతూ తమ బుడబుక్కల సంఘాన్ని సమాజంలో ఉన్నతంగా గుర్తింపు వచ్చే విధంగా అందరు సహకరించాలని ఆయన కోరారు. బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ఉండి భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ఒక తాటిపైకి వచ్చి మన ఓటు మనకే వేసుకుందాం అనే నినాదంతో ముందుకెళ్లి అధికారం సాధించుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పి సతీష్ సాగర్, బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్, ఆశాడపు దేవేందర్, ఉమా, చంద్రశేఖర్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, మాధవ్, నరేందర్‌నేత నల్లతీగల రాజు,శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 3వ తేదీన నుమాయిష్ ప్రారంభం

**గోషామహల్, డిసెంబరు 29 ప్రభాతవార్త:**

జనవరి మాసం వస్తుదంటే చాలు నగర ప్రజలకు అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన(ఎగ్జిబిషన్) గుర్తుకు వస్తుంది. ప్రతి ఏడు మాదిరిగానే ఈ ఏడు ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర్వహించేందుకు సొసైటీ నాయకుల ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఈసారి జనవరి ఒకటవ తేదిన కాకుండా 3వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని గాంధీ సెంటినరీ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ ప్రతినిధులు ప్రభాశంకర్, డి.సురేష్ కుమార్, కె.నిరంజన్, డి.మోహన్, డాక్టర్ ఎం. సురేష్‌రాజ్‌తో కలిసి సొసైటీ కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి మాట్లాడుతూ నుమాయిష్‌ను దాదాపు 45 రోజుల పాటు నగర ప్రజలను ఆలరించేందుకు గాను ఎగ్జిబిషన్‌ను సర్వహంగులతో తీర్చిదిద్దుతున్నారు. 84 వసంతాల అఖిల భారత ఎగ్జిబిషన్ (నుమాయిష్) వివిధ పారిశ్రామిక ఉత్పత్తులకు సంబంధించిన స్టాళ్లు దేశ నలుమూలలో ఉన్న పరిశ్రమల వారు తమ ఉత్పత్తులను ప్రదర్శించుకునేందుకుగాను స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 84 సంవత్సరాలుగా జంట నగరాల ప్రజలను అలరిస్తున్న ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర్వహించేందుకు సందర్శకులకు పలు సౌకర్యాలు కల్పించేందుకుగానే ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో 20 విద్యాసంస్థలు కొనసాగుతున్నట్లు చెప్పారు. 30వేల మంది విద్యార్థినులకు విద్యా భోదనలను అందిస్తున్నట్లు చెప్పారు. 26 ఏకరాల సువిశాలమైన స్థలంలో నుమాయియిష్ నిర్వహిస్తున్నామన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌కు దేశ, విదేశాలలో ప్రాముఖ్యత





మాట్లాడుతున్న ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు

సంతరించుకుందని, 46 రోజులపాటు నుమాయిస్ కొనసాగుతుందన్నారు. ఈ ఎగ్జిబిషన్ ప్రజాదరణ చూరగొనడంతోపాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఉత్పత్తి చేసిన ఉత్పత్తులకు విస్తృత ప్రచారం లభించడంతో వాటి విక్రయాలకు కేంద్రంగా నిలిచింది. ప్రతి ఏటా దాదాపు 25 లక్షల మంది సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారంటే అతిశయోక్తి కాదు. సుమారు 2000 స్టాళ్ల ఏర్పాటుతో కొనసాగే ఈ ఎగ్జిబిషన్ నగర ప్రజలనే కాకుండా పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి సందర్శనకు వచ్చే వారిని అలరిస్తోందన్నారు. పలు పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల స్టాళ్లు, ఫుడ్‌కోర్టులు, సందర్శకులకు అలరించేందుకు గాను అమ్యూజ్‌మెంట్ పార్క్ ఇలా అనేక స్టాళ్లు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర శాఖలు కూడా స్టాల్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాలకు రెవెన్యూ లభిస్తోందన్నారు. గత ఏడాది జిఎస్‌టి ద్వారా 9కోట్ల 66లక్షల రూపాయల రెవెన్యూ చెల్లించడం జరిగిందన్నారు. అదే విధంగా జిహెచ్ఎంసి కూడా రెవెన్యూ లభిస్తోందన్నారు. ఎగ్జిబిషన్‌తో మూడు నెలలపాటు పదివేల మంది ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభిస్తోందని వివరించారు. వచ్చిన ఆదాయంతో 20 విద్యా సంస్థల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యాప్తికి చర్యలు తీసుకుంటున్నామని, ఆయా కలాశాలలు ద్వారా ప్రతి సంవత్సరం 30 వేల మంది విద్యను అభ్యసిస్తుండగా 2500 మంది టిచింగ్, నాన్‌టిచింగ్ సిబ్బంది పని చేస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో వినయ్‌కుమార్, అనిల్‌స్వరూప్‌మిశ్రా, అదిత్య మార్గం, ఆశ్విన్‌మార్గం తదితరులు పాల్గొన్నారు.

**భద్రతా చర్యలు తీసుకుంటున్నాం:**

ఎగ్జిబిషన్ నిర్వహణ సందర్భంగా సందర్శనకు విచ్చేసి సందర్శకులకు అన్నివిధాలా భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్నా క్షణాలలో చర్యలు తీసుకునేందుకుగాను ఎగ్జిబిషన్ మైదానం మొత్తం వాటర్ పైపులైన్ వేయడం జరిగిందన్నారు. ఒక ఫైరింజన్ తో సమానమైన 82 హైడ్రెంటెలను ఏర్పాటు చేశామన్నారు.

అదేవిధంగా రెండు ఫైరింజన్‌లను మైదానంలో అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. 100 సిసి కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని, దీంతో పాటు అంత గ్గత భద్రతాను ఏర్పాటు, నిఘాఏర్పాటు చేసేం దుకు వాచ్‌టవర్‌ల ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**ఎగ్జిబిషన్ మైదానంలో మొదటిసారి డబుల్ డెక్కర్ బస్**

ఎగ్జిబిషన్‌ను క్షణాలలో చుట్టిముట్టి వచ్చేందుకు వీలుగా ప్రస్తుతం కొనసాగుత్ను మిని ట్రైన్‌తో పాటు ఈ సంవత్సరం నూతనంగా అద్దాలతో కూడిన డబుల్ డెక్కర్ బస్సును అందుబాటులోకి తీసుకు వస్తున్నామని ఎగ్జిబిషన్ సొసైటీ కోశాధికారి డాక్టర్ ప్రభాశంకర్ తెలిపారు. అమెరికా, లండన్‌లలో మాదిరిగా ఈ బస్సులో సందర్శకులకు ఎక్కి అద్దాల లోపల నుంచి ఎగ్జిబిషన్‌ను వీక్షించే అవకాశం ఉంటుందన్నారు. మైదానంలో పలు ప్రాంతాలలో ఎల్ఇడి స్క్రీన్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రచార ప్రకటనలను వేయడం జరుగుతుందన్నారు. వివాహ వార్సికోత్సవాలు, పుట్టిన రోజు వేడుకలకు సంబంధించి స్క్రీన్‌ల ద్వారా ప్రచారం చేసేందుకుగాను సొసైటి పబ్లిసిటి కన్వీనర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటారని తెలిపారు. పెరిగిన ప్రవేశ రుసుము అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (ఎగ్జిబిషన్) ప్రవేశ రుసుంను 50 రూపాయలుగా ఎగ్జిబిషన్ సొసైటి మేనేజింగ్ కమిటిలో నిర్ణయం తీసుకున్నట్లు సొసైటీ కోశాధికారి డాక్టర్ బి.ప్రభాశంకర్ తెలిపారు. రూ. 40 నుంచి అదనంగా 10 రూపాయలు పెంచినట్లు చెప్పారు. 5 సంవత్సరాలోపు ఉన్న వారికి ఉచిత ప్రవేశ ఉంటుందన్నారు.





ఎన్టీఆర్ స్టేడియంలో మూడు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రొ ఘంటా చక్రపాణి, డాక్టర్ మంగారి రాజేందర్, వేదకుమార్ మణికొండ తదితరులు

## ఎన్టీఆర్ స్టేడియంలో పుస్తకావిష్కరణలు

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :**

డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ సంస్థ 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో తన తాజా మూడు పుస్తకాలను విడుదల చేసింది. ఈ కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఎన్‌టిఆర్ స్టేడియంలో జరిగింది. ఆవిష్కరించిన మూడు పుస్తకాలలో డాక్టర్ మంగరి రాజేంద్ర రచించిన 'కోర్టు తీర్పులో సాహిత్య మెరుపులు', డాక్టర్ ఎమని శివనాగిరెడ్డి రచన 'తెలంగాణ శిథిలాలు..వ్యథాభరిత కథనాలు', రామోజు హరగోపాల్ రచించిన 'తెలంగాణ చరిత్ర తొవ్వల్లో' అనే పుస్తకాలు ఉన్నాయి. ఈ పుస్తకాలు తెలంగాణ సాహిత్యం, చరిత్ర, మరియు సంస్కృతిని విశదీకరిస్తూ, పాఠకుల మనసులను ఆకట్టుకునేలా రూపొందించబడ్డాయి.

డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (డీఏటీ) చైర్మన్ వేదకుమార్ మణికొండ స్వాగతం పలికి పుస్తకాల్లోని చారిత్రక అంశాలను వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్ ఏయూ) వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, పత్రికా సంపాదకులు కె.రామచంద్రమూర్తి హాజరయ్యారు. డాక్టర్ మంగరి రాజేంద్ర, విశ్రాంత న్యాయమూర్తి, "కోర్టు తీర్పులో సాహిత్య మెరుపులు" రచయిత పుస్తకాలను లాంఛనంగా ఆవిష్కరించి సమీక్షించారు. తెలంగాణ వారసత్వాన్ని పరిరక్షించడంలో వాటి పాత్రను నొక్కి చెబుతూ పుస్తకాల చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరించారు.

తెలంగాణ చరిత్ర, సాహిత్యం, సాంస్కృతిక వారసత్వానికి వారు చేసిన కృషిని నొక్కిచెబుతూ పుస్తకాల ప్రాముఖ్యతపై తమ ప్రసంగాలతో కార్యక్రమాన్ని సుసంపన్నం చేశారు. కార్యక్రమంలో రచయితలు బీవీ భద్రగిరీష్, డాక్టర్ డి.ఆర్.శ్యాంసుందర్‌రావు పాల్గొన్నారు. ప్రధాన అతిథులు ఆవిష్కరించిన మూడు పుస్తకాల విశేషాలను తెలియజేశారు. ఇలాంటి ప్రచురణలు తెలంగాణ గాఢ వారసత్వానికి జీవం పోస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమం రచయితలు, చరిత్రకారులు, విద్యావేత్తలు మరియు పుస్తక ఔత్సాహికులతో సహా ఉత్సాహభరితమైన ప్రేక్షకులను ఆకర్షించింది.

## జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు నిర్వహించాలి

**సికింద్రాబాద్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** ఎస్సీ రిజర్వేషన్‌లను జనాభా ప్రాతిపదికన నిర్వహించాలని, ఇందుకోసం జనవరి 3న లక్ష డప్పులు, వెయ్యి గొంతులు అనే భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతిమాదిగ, ఎమ్మార్పీఎస్, జాతీయ ఉపాధ్యక్షుడు బుంజూరి విజయ్ మాదిగ కోరారు. పార్సిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఎస్సీలలోని అన్నికులాలకు న్యాయం చేకూరాలనే ఉద్దేశంతోనే రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపరిచారన్నారు. బిసి రిజర్వేషన్లలో వర్గీకరణ ఉన్నట్లుగానే ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణ చేయాలని మంద కృష్ణమాదిగ నేతృత్వంలో రాజీలేని పోరాటం జరిగిందన్నారు. ఈ పోరాట ఫలితంగానే సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇచ్చిందని అన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు సిద్ధపడిన సమయంలో కొంత మంది స్వార్థపరులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడం అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడవడమే అవుతుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ మీద నియమితులైన ఏక సభ్య కమిషన్ జనాభా ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణను అమలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 3న లక్ష డప్పులు, వెయ్యి గొంతులు, మహాబారి ప్రదర్శనను విజయవంతం చేయడానికి జనవరి 3న న్యూ అశోక్ నగర్ పార్సి గుట్ట కమ్యూనిటీ హాల్ నుండి ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయం వరకు డప్పులతో ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్ మాదిగ, ఎడ్ల రుద్రి మాదిగ, సత్యనారాయణ మాదిగ ,తుమ్మల శివప్రసాద్ మాదిగ, రఘు మాదిగ, దేవేంద్ర మాదిగ, మురళీధర్ మాదిగ, కొప్పుల సాయికుమార్ మాదిగ, డప్పు మహేష్ మాదిగ, పాండు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్రమోడీదీ ఫాసిస్టు పాలనే

**-మార్క్సిస్టు సిద్ధాంతవేత్త, మజ్దూర్ బిగుల్ సంపాదకుడు, అభినవ్ సిన్హా**

**చిక్కడపల్లి, డిసెంబర్ 29 (ప్రభాతవార్త:** దేశంలో నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రభుత్వ పాలన నిస్సందేహంగా ఫాసిస్టు పాలనేనని మార్క్సిస్టు సిద్ధాంతవేత్త, మజ్దూర్ బిగుల్ సంపాదకుడు, అభినవ్ సిన్హా అభిప్రాయపడ్డారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏడవ అంతర్జాతీయ అరవింద్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు 'ఇరవై ఒకటవ శతాబ్దంలో ఫాసిజం: కొనసాగుతున్న అంశాలు, నూతన లక్షణాలు, సమకాలీన శ్రామికవర్గ వ్యూహం' అంశంపై ఏడవ అంతర్జాతీయ అరవింద్ మెమోరియల్ సెమినార్ జరిగింది. దేశవ్యాపితంగా వందలాది మంది సామాజికవేత్తలు, విద్యావేత్తలు, మేధావులు ఈ ఐదు రోజుల సెమినార్‌లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రధానవక్తగా పాల్గొన్న అభినవ్‌సిన్హా మాట్లాడుతూ ఫాసిజానికి వ్యతిరేకంగా సమర్థవంతమైన శ్రామికవర్గ వ్యూహాన్ని రూపొందించే అంతిమ లక్ష్యంతో ఫాసిజానికి సంబంధించిన వివిధ అంశాలను అర్థం చేసుకోడానికి అరవింద్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మార్క్సిస్ట్ స్టడీస్ ఈ సెమినార్ నిర్వహిస్తోందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండే కాక, యూఎస్, ఆస్ట్రేలియా, నేపాల్ వంటి దేశాల కార్యకర్తలు సమకాలీన ఫాసిస్టు వ్యతిరేక కమ్యూనిస్టు వ్యూహాన్ని చర్చించేందుకు ఈ సెమినార్‌లో పాల్గొంటున్నారు. ఆర్.రఘు, కేజీ రామచంద్రరావు, శివానీకౌల్, డా. నిఖిల్ ఏకడే, ప్రేమ్ ప్రకాష్‌లతో కూడిన అధ్యక్షవర్గం మొదటిరోజు సభను నిర్వహించింది. కార్మిక వర్గ విముక్తి కోసం పోరాడుతూ ప్రాణాలు అర్పించిన సామాజికవేత్తలు అరవింద్ సింగ్, మీనాక్షిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అరవింద్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సత్యం వెర్మ ట్రస్ట్ ఉద్దేశ్యాలు, కార్యక్రమాల గురించి వివరించి సెమినార్‌ను అధికారికంగా ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం పీహెచ్‌డీ చేస్తున్న శ్రీజ, ఫాసిజంపై సెమినార్ నిర్వహించడానికి గల కారణాలను వివరించారు.



పోలీసులు అరెస్టు చేసిన హుక్కా సెంటర్ కస్టమర్లు

## అక్రమ హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

**సరూర్‌నగర్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** కొత్త సంవత్సరం సమీపిస్తున్న వేళ.. హైదరాబాద్ నగర శివార్లలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడులు చేసి ఐదుగురు కస్టమర్లను అరెస్టు చేసి హుక్కాకు సంబంధించిన సామాగ్రిని స్వాధీనం చేసుకోవడంతో పాటు సెంటర్ యజమాని, మేనేజర్‌పై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం సుల్తాన్‌పూర్‌లో లైసెన్స్ ఉన్న హుక్కా సెంటర్‌ను అక్రమంగా నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు బాలాపూర్ పోలీసులు దాడులు చేశారు. ఈమేరకు సోఫియన్ బాబు(26), సయ్యద్ మన్సూర్(20), సయ్యద్ అస్లం (19), మహ్మద్ నూర్ (19), షేక్ అలీ (22)లను అరెస్టు చేసి 8 హుక్కా పాట్‌లు, 16 హుక్కా పీల్చే పైపులు, 5 బ్రిక్ కోల్ బాక్సులు, సగం బాక్స్ కోకోనట్ కోల్, సగం బాక్స్ ఆపిల్ ఫ్లేవర్, 4 స్మార్ట్ ఫోన్లు, ప్రీమియం అల్యూమినియం ఫైల్ రోల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సెంటర్ యజమాని యాహ్యా, మేనేజర్ సోయబ్, కస్టమర్లపై కేసు నమోదు చేశారు.

## గృహిణి ఆత్మహత్య

**ఉప్పల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** క్షణికావేశంలో కుటంబ సభ్యులతో గొడవ పడి ఒక మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకానగర్‌లో నివసించే ముద్దంగుల నరేష్ ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. అయితే అతని భార్య ఎం.మహేశ్వరి (29), ఒక కుమారుడు మహేష్ ఉన్నారు. అయితే ఈనెల 28వ తేదిన తన అన్న మహేష్, నరేష్‌ల వద్దకు వెళ్లినట్లు తెలిపారు. దీంతో రాత్రి నరేష్, మహేశ్వరితో గొడవ పడినట్లు తెలిపారు. దీంతో నరేష్ బయటికి వెళ్లిపోగా, రాత్రి పదిన్నర సమయంలో వచ్చి చూడగా ఇంట్లో మహేశ్వరి చీరతో ఉరివేసుకుని ఉన్నట్లు తెలిపారు. మృతురాలి పెద్దనాన్న కూతురు బొడ్డుపల్లి లింగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గంజాయి విక్రేత అరెస్టు..

**పేట్‌బషీరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త :** గంజాయిని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దులపల్లిలో స్టీల్ సిటీ సమీపంలో శనివారం సుమారు 40–50 వయస్సు గల ఒక వ్యక్తి చేతిలో సంచి వేసుకొని గంజాయి అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని విచారించారు. విచారణలో ఎండి ఫీరోజ్ (42) పెయింటర్‌గా పని చేస్తూ, దులపల్లి ప్రశాంతి నగర్ కాలనీలో నివాసం ఉంటున్నట్లు తెలిసింది. అతని వద్ద 1.955 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్స్‌లాగా చేసి రూ. 200 - 300లకు అమ్ముతున్నట్లు విచారణలో ఒప్పుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** ఆరోగ్య సమస్యలతో మనస్థాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం 6:45 గంటల సమయంలో దులపల్లి శ్వేత శుభం అపార్ట్‌మెంట్ నందు వాచ్‌మెన్ ఎవరో బిల్డింగ్ నుండి దూకి కింద పడ్డారని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించగా పోచారం విలేజ్, గార్ల మండలం, మహబూబాబాద్ జిల్లాకు చెందిన పటాన్ బియాబనీ (54) ఆరోగ్య సమస్యలతో మానసికంగా బాధపడేవాడు. శనివారం కొత్త పోచారం నుండి హైదరాబాద్‌కు వచ్చారు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో డిప్రెషన్‌కు గురి అయ్యి, అపార్ట్‌మెంట్ 5వ అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. అతన్ని వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బూత్ కమిటీ అధ్యక్షున్ని సన్మానిస్తున్న లక్ష్మణ్

## బిజెపితోనే సుస్థిరపాలన సాధ్యం

**ఆమనగల్లు, డిసెంబర్29, ప్రభాతవార్త:** సుస్థిరపాలన, సమర్థవంతమైన నాయకత్వం ఉన్నందునే ప్రజలకు భారతీయ జనతా పార్టీ పట్ల ఎనలేని విశ్వాసం పెంపొందిస్తుందని ఆమనగల్లు మున్సిపాలిటీ కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ అన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలతో దేశం ఎంతో పురోగతి సాధిస్తుందని, ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రపంచంలోనే భారతదేశాన్ని ఆర్థిక బలమైన శక్తిగా తీర్చిదిద్ది అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. బిజెపి సంస్థాగత ఎన్నిక (2024) కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీ సంకటోనిపల్లి (189) బూత్ అధ్యక్షుని ఎన్నికను నిర్వహించారు. కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ అధ్యక్షతన బూత్ అధ్యక్షులుగా గజ్జె కేశవులు, ప్రధాన కార్యదర్శి లోడిగ శివలను నియమించారు. ఈసందర్భంగా కేశవులును శాలువాతో సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన బీజేపీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన వివరించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల నాటికి అన్ని బూత్‌లలో కమిటీలను నియమించి బీజేపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులుగా రాము, శ్రీకాంత్, చరణ్, వెంకటేష్, అశోక్, సాయి కిరణ్, మనిదార్, రమేష్, భారత్, అఖిల్‌లను నియమించారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు, రవీందరు, శ్రీకాంత్, వెంకటేష్, కల్వకుర్తి అసెంబ్లీ బిజెపి పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ పద్మ ప్రశాంత్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపి మందకు పరామర్శ



మంద జగన్నాథ్‌ను పరామర్శిస్తున్న యాదిలాల్

**ఆమనగల్లు, డిసెంబర్29, ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యుడు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మంద జగన్నాథ్‌ను ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు, కల్వకుర్తి టీడీపీ కన్వీనర్, సీనియర్ న్యాయవాది అండేకార్ యాధిలాల్ పరామర్శించారు. ఇటీవల జగన్నాథ్ తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న యాదిలాల్ ఆస్పత్రికి చేరుకొని జగన్నాథ్ ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జగన్నాథ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. పరామర్శించిన వారిలో ఆమనగల్లు మాజీ చేనేత సంఘం అధ్యక్షుడు కోట కృష్ణయ్య, రాము గౌడ్ తదితరులు ఉన్నారు.

## మన్మోహన్‌సింగ్‌కు క్రీడాకారుల నివాళి



మన్మోహన్‌సింగ్‌కు నివాళులు అర్పిస్తున్న క్రికెట్ క్రీడాకారులు

**ఆమనగల్లు, డిసెంబర్29, ప్రభాతవార్త:** దివంగత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి క్రికెట్ క్రీడాకారులు సంతాపం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని మేడిగడ్డ గ్రామంలో జరుగుతున్న ఎంపీఎల్ క్రికెట్ టోర్ని సంధర్భంగా ఆదివారం మ్యాచు ప్రారంభానికి ముందు క్రీడాకారులు వ చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకుని నివాళులు అర్పించారు. అనంతరం దివంగత మాజీ ప్రధానమంత్రి సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో రమేష్, నిరంజన్, భాస్కర్, రాజ్‌కుమార్, డీలర్ కృష్ణ, డాక్టర్ సాయిపవన్, తెనాలి, జైరాంనాయక్, రాజ్‌గాంధి, రఘు, పవన్, సంతోష్, ఉమ తదితరులు ఉన్నారు.

## నేడు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**బొంరాస్‌పేట్, డిసెంబర్29, ప్రభాతవార్త :** కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ తిరుపతిరెడ్డి అధ్వర్యంలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ నిర్వహించడం జరుగుతుందని మండల అధ్యక్షులు నర్సిములుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొంరాస్‌పేట్ మండల పరిషత్ కార్యలయంలో నేడు కళ్యాణ లక్ష్మి, షీదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మండల పరిధిలోని కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా నాయకులు అధికసంఖ్యలో పాల్గోని విజయవంతం చేయాలని అయన అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులు పాల్గోని తమ చెక్కులను తీసుకొవాలని నర్సిములుగౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## అయ్యప్ప స్వాములు సన్నిదానంలో సిఐ



అయ్యప్ప స్వామి సన్నిదానంలో పాల్గొన్న మేడ్చల్ సీఐ సత్యనారాయణ

**మేడ్చల్, డిసెంబర్ 29. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ గ్రామంలో అయ్యప్ప స్వాముల సన్నిదానానికి మేడ్చల్ సిఐ సత్యనారాయణ విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కండ్లకోయ మాజీ సర్పంచ్ కందాడి నరేందర్ రెడ్డి, రవీందర్ గౌడ్, నాయకులు కృష్ణ గౌడ్, రాజేందర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, నాయకులు యాదయ్య, రాజు, అరవింద్, గురు స్వాములు వై రాజు, శ్రీనివాస్ గౌడ్, బాలకృష్ణ, సాయి, ప్రణయ్, అయ్యప్ప స్వామి మాల దారకులు తదితరులు పాల్గొన్నారు

## కష్టజీవులకు అండగా ఎర్రజెండా

**సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి**

**మొయినాబాద్, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** గత వంద సంవత్సరాల నుండి దేశా వ్యాప్తంగా ఉన్న కార్మికులకు, కర్షకులకు కూలీలకు, ప్రతి పేదవాడికి కష్టజీవులకు అండగా ఎర్రజెండా నిలబడిందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె. రామస్వామి అన్నారు, ఆదివారం ఆయన సిపిఐ పార్టీ ఉద్భవించి వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మొయినాబాద్ మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామం తోల్కట్ట, పెద్దమంగళారంలో జెండాను ఆవిష్కరించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరయిన రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జ్ కె. రామస్వామి హాజరయ్యారు, మండలం లోని పలుగ్రామాల్లో జెండాను ఆవిష్కరించి అనంతరం ఆయన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల కాలంలో సురీర్ఘకాలం నుండి సిపిఐ దేశంలోని కష్టజీవుల కోసం పోరాడుతుం దన్నారు,

## కన్హ శాంతివనంలో పకృతి అందాలు వీక్షించిన సీఎం

**నందిగామ, డిసెంబర్ 29, ప్రభాతవార్త** నందిగామ మండలం కన్హ శాంతి వనంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచ దేశాల నుండి తెచ్చినాటిన మొక్కలు, చెట్లు, ప్రకృతి అందాలను ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక బ్యాటరీ వాహనంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, హార్ట్ ఫుల్ నెస్ అధ్య క్షుడు కమ్లేష్ డీ పటేల్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తో కలిసి తిలకించారు.



ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ధ్యాన కేంద్రం, ఆహ్లాదం, ఆరోగ్యం పంచుతూ సర్వరోగ నివారిణి ని తలపించే పకృతి వనమూలికల చెట్లను తిలకించడమే కాకుండ వాటి ఉపయోగాలను హార్ట్ ఫుల్ నెస్ అధ్యక్షుడు దాజీని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యవంతమైన హార్ట్ ఫుల్ నెస్ అందాలను చూసి ముఖ్యమంత్రి ఆకర్షితులైనట్లు షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. తమ అభిమాన నేత సీఎం రేవంత్ రెడ్డి విచ్చేసిన సందర్భంగా నియోజకవర్గంలోనీ ఆయా గ్రామాల నుండి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు సీఎం అభివాదం చేసి తిరుగు ప్రయాణమయ్యారు. అంతకు ఎముందు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కన్హ శాంతివనాన్ని సందర్శించి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల పార్టీల అధ్యక్షుడు జంగ నరసింహులు, హరినాథ్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు తిరు పతి రెడ్డి, కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, పాండురంగారెడ్డి, పసుల బుచ్చయ్య, మహబూబ్, కావలి కృష్ణ, జయ సుదర్శన్ గౌడ్, ఎం అంజన్ గౌడ్ ,సి నర్సింలు, బుయ్యని వీరేందర్ ,మంకాల శ్రీశైలం, గుండాల వేణు, నీరటీరవీందర్, ఆకుల జ్ఞానేశ్వర్, ఎన్ రవీందర్ గౌడ్, ధరూర్ సతీష్ పాటిల్, జింకల జంగయ్య, బుగ్గ నర్సింలు, రాజు, సాములయ్య, బుగ్గ శ్రవణ్, కృష్ణ, ఎర్రగారి రమేష్, శివగల్ల సుమన్, ఆవుల శివ, జెనిగ జగన్, వెంకట చారి, ఎర్రోళ్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్ విద్య ఎంతో ప్రాముఖ్యం



**కొత్తూర్, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** నేటి ఆధునిక సమాజంలో ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ విద్య ఎంతో ముఖ్యమని దేవేందర్‌యాదవ్, జాండుగూడెం సుదర్శన్‌గౌడ్ అన్నారు. ఆదివారం కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలో బోధివర్మ మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు మాస్టర్ కరోళ్ల నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్టు ప్రధానం కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దేవేందర్‌యాదవ్ హాజరయ్యారు. కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమొంటోలు, బెల్టులు, ధృవపత్రాలు అందజేశారు. ఫస్ట్ రౌండ్ బ్రౌన్ బెల్ట్ సాధించిన రంగాపూర్ చాణిక్య, కొత్తూర్ దివ్యను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....కరాటే విద్యార్థులకు ఆత్మరక్షణే కాకుండా మానసిక ఒత్తిడిని తగ్గించి, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కరాటే వంటి శారీరక విన్యాసాలల్లో పాల్గొనడానికి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పలు కరాటే విన్యాసాలు ప్రదర్శించి ప్రశంసాలు అందుకున్నారు. అనంతరం వారికి బెల్టులు, ధృవపత్రాలు అందజేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు కరాటే ప్రాముఖ్యతను పాఠాలు నేర్పిందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీలు బ్యాగరి యాదయ్య, ఇందూరి సత్యమ్మ కుమారుడు శ్రీనివాస్, మున్సిపాలిటీ కోశాధికారి చింత సాయి తేజేశ్వర్, చిలకమరి నరసింహ, గోవిందునాయక్, భార్గవ్‌గౌడ్, విక్రమ్, మహిళా సంఘం అధ్యక్షురాలు వేదావతి, వైస్ ప్రెసిడెంట్, ప్రభు మాస్టర్, ఇన్స్‌ట్రక్టర్ ప్రవీణ్, శ్రీశైలం, శ్రీరాములు, రవీందర్ తదితరులు ఉన్నారు.

## బిసి సేన గ్రామ కమిటీ అధ్యక్షులుగా ప్రవీణ్ గౌడ్



నియామక పత్రాన్ని అందజేస్తున్న బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ

**షాబాద్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** మండలంలోని మాచన్ పల్లి గ్రామంలో బీసీసేన గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీసేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులుగా ప్రవీణ్ గౌడ్, ఉపాధ్యక్షులుగా మాణిక్యం, నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా కుమార్, కార్యదర్శులుగా నరేష్, రమేష్ గౌడ్, శేఖర్, ముసలయ్య, శివకుమార్, సభ్యులుగా నర్సింలు, కుమార్, శ్రీకాంత్, రాఘవేందర్, దేవేష్, అంజయ్య, నవీన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బర్క కృష్ణ మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పించాలన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ బీసీల హక్కుల సాధనకోసం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకల్లో ఇష్టారాజ్యాంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

**-పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్**

**పరిగి రూరల్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా యువకులు అత్యుత్సాహం ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ పేర్కొన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే తల్లిదండ్రులదే బాధ్యత అని తెలిపారు. ఇబ్బంది కలిగించేలా డీజేలు యువకులు మితిమీరిన డ్రైవింగ్ చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు అని తెలిపారు. ప్రైవేటు ఆస్తులపైనా, వీధి దీపాలపైనా రాళ్లు వేసి అద్దాలు పగులగొట్టడం, మహిళలను ఇబ్బంది పెట్టడం, అసభ్యంగా ప్రవర్తించడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, వంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

## ఫామ్‌హౌస్‌పై పోలీసులు దాడి

**ఉక్క మద్యంతో పట్టుబడ్డ యువకులు**

**మొయినాబాద్ డిసెంబర్ 29, ప్రభాతవార్త :** మొయినాబాద్ మం డలంలోని యేన్కెపల్లి ఓ ఫామ్‌హౌస్‌లో విశ్వసనీయ నమ్మదగిన సమాచారంతో ఎస్‌వోటి పోలీసులు రైడ్ చేయగా అట్టి ఫామ్‌హౌస్‌లో విచ్చలవిడిగా ఉక్కా, మధ్యం సేవిస్తు, కొంత మంది వ్యక్తులు పోలీ సులకు పట్టుబడ్డారు, ఎలాంటి అనుమతులు లేకుండా ఆల్కహాల్, హుక్కా సేవిస్తున్నారని, తెలిపారు, వెంటనే ఈ యొక్క ఈవెంట్‌ను ఆర్గనైజ్‌చేసిన ఆర్గనైజర్లను, మద్యం సేవిస్తున్నవారిని అదుపులోకి తీసుకొని అక్కడ ఉన్న హుక్కా, మద్యం బాటిల్లను స్వాదీనం చేసుకు న్నారు, అట్టి వారిపై ఫామ్‌హౌస్ యాజమాన్యం పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు,

## ఎర్రోనిగూడలో ఘనంగా మైసమ్మ బోనాలు

**షాబాద్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** మండలంలోని ఎర్రోనిగూడ గ్రామంలో మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను అలంకరించుకొని గ్రామ పురవీధుల గుండా ర్యాలీగా బయలుదేరారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యా సాల మధ్య అమ్మవారి ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు.

## ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో చిన్నారి మృతి

**తలకొండపల్లి, డిసెంబర్ 29, ప్రభాతవార్త** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామములో ఆటో డ్రైవర్ నిర్లక్షయం తో చిన్నారి పాప మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది .అందుకు సంబందించిన వివరాల ప్రకారం ఎస్సై ఏ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పుష్ప రాజ్ యాదవాసి అతని కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం పడకల్ గ్రామానికి వచ్చి పాలు పితకడానికి జల్లెల శేఖర్ యాదవ్ దగ్గర పని కుదించుకున్నారు. ఈరోజు ఉదయం 8 గంటల సమయంలో పాల డబ్బాలను ఆటోలో వేశారు. పుష్ప రాజ్ యాదవాసి కూతురు అయిన ప్రియాన్సీ 11 నెలల చిన్నారి ఆడుకుంటూ ఆటో కిందికి వెళ్ళింది. అది గమనించకుండా డ్రైవర్ ఆటోను ముందుకు తీయడంతో పాప ఆటో కింద పడి రక్త గాయాలు అయినాయి వెంటనే పాప కుటుంబ సభ్యులు కడ్తాలోని గ్రేస్ హాస్పిటల్ కు తీసుకొని వెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టరు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం చిన్నారి శవాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నారి తండ్రి యొక్క ఫిర్యాదు మేరకు చిన్నారి మరణానికి కారకుడైన జిన్ కుంట నరేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**తలకొండపల్లి, డిసెంబర్ 29, ప్రభాతవార్త** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ కార్యకర్త పోతుగంటి మైసయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో హైదరాబాద్ లోని అపోలో హాస్పిటల్ లో కడుపునొప్పి బాధతో చికిత్స తీస్కుంటున్నారు. ఈవిషయం తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోకూరు ప్రభాకర్ రెడ్డి గారి సహకారంతో తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా చికిత్స నిమిత్తము 5,000/ఆర్థిక సహాయం మైసయ్య భార్యకు అందజేశారు కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్ గారు రంగారెడ్డి జిల్లా జర్నల్ సెక్రెటరీ రవీందర్ యాదవ్ గారు బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ గారుమాజీ ఎంపిటిసి పెంటయ్య గారు సీనియర్ నాయకులు రామ్మోహన్ రెడ్డి గారు తలకొండపల్లి టౌన్ ప్రెసిడెంట్ రమేష్ అంజయ్య యువజన కాంగ్రెస్ నాయకులు పోతుగంటి రమేష్ జూలపల్లి శ్రీను తదితరులు పాల్గొనడం జరిగింది..

## కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ



కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**పరిగి రూరల్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణం, వివిధ గ్రామాల ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయ్యూబ్, స్థానిక కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో సర్వదోష నివారణ మహాయజ్ఞం



సాయిగీతాశ్రమంలో నిర్వహించిన సర్వదోష నివారణ మహాయజ్ఞంలో మాట్లాడుతున్న సాయికుమార్ బాబా

**మేడ్చల్, డిసెంబర్ 29. ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని కండ్లకోయలో గల సాయిగీతాశ్రమంలో ఆదివారం ఆశ్రమ వ్యవస్థాపకులు సాయికుమార్ బాబా ఆధ్వర్యంలో సర్వదోష నివారణ మహాయజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. లోకకళ్యాణం కొరకు వేలాది మంది భక్తులతో ఏక కాలంలో లోక కళ్యాణం కొరకు కొబ్బరికాయలు కొట్టించడం కనుల పండుగగా జరిగింది. మహాయజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఉదయం ఆశ్రమంలో యజ్ఞం నిర్వహించి మధ్యాహ్నం సాయికుమార్ బాబా భక్తులనుద్దేశించి మాట్లాడారు. మనిషి స్వార్థం కోసం తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని కలుషితం చేయడంతో వాతావరణ సమతుల్యత ఏర్పడి విపరీత పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. వాతావరణ కలుషితం చేయడంతో పాటు చెట్లను విపరీతంగా నరికివేయడం, ఖనిజాలని విచ్చలవిడిగా వినియోగించడంతో మనిషి జీవితంపై విపరీత ప్రభావం పడిందన్నారు. గడిచిన 5 సంవత్సరాలు గడ్డుకాలంగా మనిషి జీవితం కొనసాగిందని, కరోన కాలంలో దైవాన్ని స్మరించడం తప్ప ఏవి మనిషిని కాపాడలేకపోయాయని అన్నారు. తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని కాపాడుకుంటూ, ఖనిజాలను విచ్చలవడి వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. వాతావరణానికి అనుగుణంగా జీవించి, సాయంత్రం ఆశ్రమానికి విచ్చేసిన భక్తులతో శాంతి మంత్రం చెప్పించి ప్రపంచ శాంతి కొరకు అందరితో ఒకేసారి కొబ్బరి కాయలు కొట్టించారు. ఈ కార్యక్రమంలో హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, వివిధ పీఠాదిపతులు దుర్గాప్రసాద్ స్వామి, నంజవదూత మహా స్వామి, రామానుజ జీయర్ స్వామి, శ్రీధర్ స్వామి, వేదాంత సరస్వతి, మాతా సత్యవాణి, స్థానిక నాయకులు, ప్రజలు, భక్తులు, ఆశ్రమ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**మొయినాబాద్‌డిసెంబర్ 29, ప్రభాతవార్త :** గండిపేట చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం అయిన సంఘటన మొయి నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హిమాయత్‌నగర్ రెవెన్యూలో గండిపేట సరస్సు వెనుక నీటిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని పోలీసులు తెలిపారు, ఇంకా మృతదేహం ఎవరిదని గుర్తుంచలేకపో తున్నామని, బాడి పూర్తిగా ఉబ్బిఉండడంతో గుర్తుపట్టని పరిస్థితిలో ఉందన్నారు, మృతిడి వంటి పై ఉన్న దుస్తుల గుర్తులు తెలియజేశారు, ఎరుపు రంగు చెక్స్ చోక్కా, ఎస్‌వి. గ్రూప్ పేరుతో నేవి బ్లూ కలర్ బనీన్, ఎత్తు 5 లంగులాలు, వయస్సు సుమారు, 40 నుండి 45 మద్యలో ఉంటుందన్నారు, వంటి పై ఎలాంటి గాయాలు లేవు, ఎవరైన ఇట్టి వ్యక్తిని గుర్తుపడితే మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాల్సిం దిగా కోరారు, సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు, 9491039043, 9490617188 సంప్రదించాల్సిందిగా కోరారు.